

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ



## – వసుంధర

***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (52)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి - రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గ్లో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

### *స్వర్గావరోహణ పర్వం*

మనిషి జీవితంలో అంతిమ ప్రయాణం ఊర్ధ్వలోకాలకి. అవి మనకంటే పైన ఉన్నది కాబట్టి- ఆ ప్రయాణాన్ని ఆరోహణం అంటారు. ఈ ప్రయాణం సామాన్యులకైతే తనువు చాలించాకనే మొదలౌతుంది. మహాభారత కావ్యంలో పాండవులు అసామాన్యులు కాబట్టి భార్యా సమేతంగా బొందితోనే స్వర్గానికి బయల్దేరారు. అదే ఆ కావ్యంలో చివరిదైన స్వర్గారోహణ పర్వం.

కలికాలంలో ఊర్ధ్వలోకాలు కూడా భూమ్మీదే ఉంటాయి. సామాన్యులైనా, అసామాన్యులైనా జీవితకాలంలోనే కర్మఫలాన్ని బట్టి వాటి అనుభూతుల్ని పొందుతుంటారు.

ఈ నవలకు తొలిభాగమైన 'ఫారిన్ వెళ్లాలండి' నవలలో పాశ్చాత్య దేశాలను స్వర్గంతో పోల్చడానికి ఉన్న అవకాశాల్ని పరిశీలించాం. ఇండియా నుంచి జర్మనీకి వెళ్లే అవకాశాన్ని బొందితో స్వర్గారోహణం అనగల మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నాం.

తర్వాతి భాగం 'ఫారిన్ వెళ్లానండి' నవలలో, ఆ స్వర్గంలోని మంచిచెడ్డల లోతుపాతుల్ని అవగాహన చేసుకునేందుకు సహకరించే ఎన్నో విశేషాల్ని పంచుకున్నాం.

ఇక నాకు ఇక్కణ్ణించి స్వదేశానికి తిరిగివెళ్లే సమయం వచ్చింది. ఇప్పుడు నేనున్నది స్వర్గం ఐతే స్వదేశాన్ని ఏమనాలి?

నరకం అందామా అంటే- నాకక్కడ సుఖ సంతోషాలున్నాయి. భూలోకమందామా అంటే- ఇప్పుడు నేనున్నదీ భూలోకంలో ఒక భాగమే!

మనకైతే- 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నది రామాయణ కాలంనుండి వస్తున్న మాట.

జనని, జన్మభూమి- స్వర్గంకంటే గొప్పవని ఆ శ్లోకార్థం.

ఇప్పుడున్నది స్వర్గం ఐతే- నేను తిరిగి వెళ్లబోతున్నది- స్వర్గంకంటే ఎక్కువైన మాతృదేశం.

ఆర్థికంగా, సాంకేతికంగా మనకంటే ఉన్నత స్థానంలో ఉన్నది కాబట్టి అక్కణ్ణించి ఇక్కడికి రావాలంటే ఆరోహణం. ఇక్కణ్ణించి అక్కడికి వెళ్లాలంటే అది అవరోహణం.

నిజం చెప్పొద్దూ- స్వర్గారోహణమప్పటికంటే, ఈ అవరోహణ గురించిన భావనకే నా తనువు, మనసు ఉప్పొంగుతున్నాయి. ముహూర్త మెప్పుడా అని తహతహలాడుతున్నాను.

శ్రీమతికి మనసులో ఏముందో తెలియదు కానీ- ఆమెకు నా తహతహ చికాకు కలిగించింది.

"పుట్టినూరు కోనసీమలో. అదెలాగూ దాటొచ్చేశారు. ఇక ఉద్యోగం ఒరిస్సాలో ఐతేనేం, బెర్లిన్లో ఐతేనేం?" అందామె.

ఒరిస్సా కూడా నాకు స్వదేశమే అని చెప్పొచ్చు. కానీ అ విషయం ఆమెకు తెలియకనూ కాదు, ఆమె ప్రశ్నకు బదులూ కాదు.

"ఇక్కడ మనకెవరు ఉద్యోగమిస్తారు?" అన్నాను అదే నా సమస్య అయినట్లు.

"కన్యాశుల్కంలో- నాకు పిల్లనెవరిస్తారు అన్న లుబ్ధావధానుల్లా అనకండి. మీకిక్కడ చాలా అవకాశాలున్నాయి. వాటిని ఉపయోగించే ప్రయత్నమేమైనా చేశారా- అది చెప్పండి" నిలదీసింది శ్రీమతి.

తల్లికి బిడ్డ, భార్యకి భర్త- ఈ ప్రపంచంలో చాలా గొప్పవాళ్లలా అనిపిస్తారు. నేను ఊఁ అనాలి కానీ బెర్లిన్లో ఎన్నో ఆఫీసులు నా మెడలో ఉద్యోగమాల వెయ్యడానికి సిద్ధంగా ఉన్నాయని శ్రీమతి అభిప్రాయం. ఖండించి ప్రయోజనం లేదు. తనొప్పుకోదు.

"ఎలా ప్రయత్నిస్తాను? డెప్యుటేషన్ పూర్తవగానే బుద్ధిగా ఇండియా వచ్చేస్తాననీ, వచ్చేక కనీసం మూడేళ్ల దాకా మరెక్కడికీ వెళ్లకుండా మా ఆఫీసుకే నా సేవలందిస్తాననీ- బాండ్ రాశాను. తెలుసుకదా!" అంటూ మరో సంజాయిషీ ఇచ్చాను.

"అలా ఎందుకు బాండ్ రాశారు?" చిరాకు పడింది శ్రీమతి.

ఇప్పుడలా అంటోంది కానీ, నిజానికి బాండ్ వ్రాసినప్పుడు నాతోపాటు తనూ ఎంతో సంతోషపడింది. ఒకటి ఫారిన్ అవకాశానికి. రెండు- తిరిగొచ్చేక నా ఉద్యోగం కనీసం మరో మూడేళ్లు గ్యారంటీ!

అదీ అప్పట్లో నా మనఃస్థితి. లేకుంటే, నాది సర్వీసు సెంట్రల్ గవర్నమెంటు సర్వీసులాంటిది. ఒకసారి ప్రొబేషన్ పూర్తి చేసేక, ఉద్యోగం లోంచి తొలగించడం– తివిరి ఇసుమున తైలంబు తియ్యడమంత కష్టం. ఐనా అభద్రతా భావం నన్ను నిత్యశంకితుణ్ణి చేస్తుంది.

“ఈమాత్రం తెలియదా? బాండ్ రాయకపోతే– నన్నిక్కడికి పంపించరు....” అన్నాను.

ఐతే శ్రీమతి ఈ విషయమై ఎంత ఆలోచిస్తోందంటే, భువనేశ్వర్లో లోపాయికారీగా నేను చెప్పినవీ, తను విన్నవీ అన్నీ కలిపి ఓ ఫైలుగా తయారు చేసి సిద్ధంగా ఉంది.

నాకులాగే బాండ్ వ్రాసి– స్కాలర్‌షిప్పుమీదో, డెప్యుటేషన్ మీదో మా ఆఫీసునుంచి విదేశాలు వెళ్లినవాళ్లలో నలుగురు అమెరికానుంచి వెనక్కి రాలేదు. వాళ్లకి ఏటా ఒకసారి మా హెడ్డాఫీసునుంచి వార్నింగ్ లెటర్సు వస్తుంటాయి.

“పంపడం ఆఫీసుకి వాలాయతీ. ఊరుకోవడం వీళ్లకి ఉత్తమం. కొన్నేళ్ల తర్వాత ఆ ఉత్తరాలు వాటంతటవే ఆగిపోతాయి. అదీ ఆ బాండ్ విలువ. అప్పట్లో ఆమాత్రం తెలియలేదు. బాండు రాస్తే ఈ ఆఫీసుకి కట్టుబానిసనైపోతానన్న అనుమానంతో– నార్వే వెళ్లడానికి మంచి ఆఫరొస్తే వదులుకున్నాను. అలా ఓ గోల్డెన్ ఆపర్ట్యూనిటీ మిస్సైపోయాను. తర్వాతనుంచి కాపర్ ఆపర్ట్యూనిటీస్ కూడా రాలేదు” అని ఆఫీసులో ఓ సీనియర్ సైంటిస్టు వాపోతుంటాడు.

కొందరు లోపాయికారీగా అనేదేంటంటే– అతడు నార్వేకి అప్లై చేశాడు కానీ, ఆఫర్ రాలేదు. ఆఫర్ వచ్చిందనీ, బాండ్ రాయడం ఇష్టం లేక, వదులుకున్నాననీ అతడంటాడు. నాలాంటి కొందరు నమ్మడమో, నమ్మినట్లు నటించడమో చేస్తారు. ఈ బాండ్ అలా కూడా ఉపయోగపడుతోందని కొందరంటారు.

నేను మాత్రం– బాండుకి విలువ లేదనేవారితో, ‘అది నాకు తెలుసు, మీకు తెలుసు. దానికేం తెలుసు?’ అంటాను.

శ్రీమతి నాకు కొందరి పేర్లు చెప్పి, “వాళ్లు ధైర్యే సాహసే లక్ష్మీ అనుకున్నారు. మీరూ అలా ధైర్యం చెయ్యాలి. లేదూ పిరికివాళ్లన్న ముద్ర వేయించుకుంటారు” అంది.

“నిజాయితీ పిరికివాళ్ల లక్షణమనుకునేవాళ్లకి– నేను పిరికివాణ్ణే. కనీసం నువ్వలా అనుకోకుండా ఉంటే చాలు నాకు” అంటూ శ్రీమతి ముందరి కాళ్లకి బంధం వేశాను. అక్కడితో ఆ సంభాషణ ఆగింది.

ఐతే నా పిరికితనం బయటపడే సంఘటన మరొకటి జరిగింది.

నేను ఇండియాకు తిరిగి వెళ్లాల్సిన రోజులు దగ్గరపడుతున్నాయి. ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాను. ఈలోగా ఇక్కణ్ణించి సేకరించాల్సిన సమాచారం ఉంటే సూచించమనీ, తప్పక సేకరిస్తాననీ– ఇండియాలో నా బాస్ భరత్‌కి ఉత్తరం వ్రాశాను.

నేనా ఉత్తరం వ్రాయడానికి సైన్సుమీద ప్రేమ కాదు. భరత్ మీద అభిమానం. ఎందుకంటే, ఆయన మొహమాటస్థుడు. ఇక్కణ్ణించి తనకి ఏమైనా కావాలంటే, అడగడానికి వెనుకాడతాడు. సంకోచించొద్దనడానికీ లేఖ ఒక సూచన. అదాయన అర్థం చేసుకోగలడు.

దానికాయన్నుంచి వెంటనే బదులొచ్చింది. కానీ అది నేనూహించినది కాదు.

“తొందరపడి వెనక్కి వచ్చెయ్యకు. మన ఆఫీసు నీకు మూడు నెలలకే ఎక్స్‌టెన్షన్ ఇచ్చినప్పటికీ, దాన్ని ఆర్నెల్లు చెయ్యాలని- జర్మనీనుంచి ‘డాడ్’ ఆఫీసువాళ్లు పట్టుబడుతున్నారు. నేను కూడా అందుకు నా వంతు ప్రయత్నిస్తున్నాను” అన్నది ఆ లేఖాంశం.

ఆ ఉత్తరం భరత్ కాక ఇంకెవరైనా వ్రాసుంటే- నమ్మేవాణ్ణి కాను. ఎందుకంటే భరత్ సబ్జక్టులో దిట్ట మాత్రమే కాక నిజాయితీపరుడు కూడా! తనకు నష్టం కలగడం తథ్యమైనప్పుడు కూడా నియమపాలనకే ప్రాధాన్యమిస్తాడు. ఈ కారణాలవల్లనే- నేను మా లేబరేటరీలో ఆయనకు పూర్తిగా కట్టుబడి ఉన్నాను.

నాకు తెలియకుండా జర్మనీనుంచి ‘డాడ్’ ఆఫీసు కూడా నాకోసం ప్రయత్నాలు చెయ్యడమేమిటని ఆశ్చర్యపోయి, రాలెక్‌ని అడిగాను.

ఆయన ఆశ్చర్యపోలేదు సరికదా, గొప్ప మొహం పెట్టాడు, “నా మాట కాదంటే నేనూరుకుంటానా? బాన్‌లో ‘డాడ్’ హెడ్డాఫీసుకి గట్టిగా ఉత్తరం వ్రాశాను. వాళ్లు రంగంలోకి దిగినట్లున్నారు” అన్నాడు.

పాఠకుల సౌకర్యార్థం- అప్పటి జర్మనీ పరిస్థితిని మరోసారి గుర్తు చేస్తున్నాను.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆ దేశం రెండు భాగాలయింది. తూర్పు జర్మనీలో వ్యవస్థ కమ్యూనిజం. పశ్చిమ జర్మనీలో వ్యవస్థ కాపిటలిజం. అంతవరకూ ఉమ్మడి జర్మనీకి రాజధానిగా ఉన్న బెర్లిన్ నగరం కూడా రెండు భాగాలు చెయ్యబడింది. అందులో తూర్పు బెర్లిన్- తూర్పు జర్మనీకి రాజధాని అయింది. నేనుంటున్న పశ్చిమ బెర్లిన్, తూర్పు జర్మనీలో ఉన్న పశ్చిమ జర్మన్ నగరం. ఎవరైనా బయట్నించి పశ్చిమ బెర్లిన్‌కి రావాలంటే, తూర్పు జర్మనీలోకి ప్రవేశించాలి. రెండు జర్మనీలూ ఒకటై, మళ్లీ మొత్తం బెర్లిన్ ఆ దేశానికి రాజధాని అయింది కానీ- అంతవరకూ పశ్చిమ జర్మనీ రాజధాని బాన్ నగరం. అన్ని ముఖ్యసంస్థలకు లాగే ‘డాడ్’ హెడ్డాఫీసు కూడా బాన్ నగరంలోనే ఉండేది.

అంటే నాకు చెప్పకుండా రాలెక్ కూడా నా గురించి తన ప్రయత్నాలు చేస్తున్నాడన్నమాట!

శ్రీమతి నా గురించి అనుకుంటున్నది నిజమేనా- అని ఒక్క క్షణం అనిపించినా- తర్వాత నా ఆలోచనలు వేరే దారిలో వెళ్లాయి.

మా డైరెక్టర్ ప్రఫుల్ల మొండి మనిషి. తనకి నచ్చనిది ఆపడానికి ఎంత దూరమైనా వెళ్లగలడు. ఇంతకాలం నేనాయనకు చేసిన, చేస్తున్న నచ్చని పని- ఒక్కటంటే ఒక్కటే! అది నా బాస్ భరత్‌కి విధేయుడిగా ఉండడం. ఐతే అది నా అసహాయత అని సరిపెట్టుకుంటున్నాడు. తను వద్దన్నా అదనంగా మూడు నెలలు ఇక్కడుండాలని ప్రయత్నించడాన్ని ఆయన సహించడు. ఇప్పటికే మండిపడుతుంటాడు.

భరత్‌కీ ప్రఫుల్లకీ అంతగా పడదు. ఇప్పుడు భరత్ నాకోసం చేసే ప్రయత్నాలా అగ్నికి ఆజ్యం పోస్తాయి.

సైంటిఫిక్ రీసెర్చిలో రాజకీయాలు మహా మహా సత్యేంద్రనాథ్ బోస్ వంటివారికే తప్పలేదు. నేననగా ఎంత? కానీ అటు రాలెక్‌కీ, ఇటు భరత్‌కీ వాళ్ల ప్రయత్నాలు మానుకోమందామని చెబుదామంటే, మర్యాదగా ఉండదు

ఈ పరిణామం గురించి నేనింతలా ఆలోచించాను కానీ, శ్రీమతి మాత్రం, “మనకిక్కడ ఇంకా కొన్నాళ్లుండాలని రాసిపెట్టినట్లుంది. లేకపోతే మీరడక్కపోయినా రాలెక్ మీకోసం అంతలా పట్టుబట్టడు. అదీకాక, మీరిక్కడ అదనంగా మరో

మూణ్ణెల్లుంటే- మీరు అడక్కుండానే ఇక్కడ మీకేదో ఆఫరొస్తుందని నాకనిపిస్తోంది. అప్పుడు బాండ్ సంగతి మర్చిపోయి ఇక్కడే సెటిల్ కావచ్చు" అంది.

మరీ చిన్న వయసులో పెళ్లి చేసుకుని నాతో వచ్చేసిందేమో- ఆమెకి తనవాళ్లకంటే కూడా నేనే ఎక్కువ. నేనే తన ప్రపంచం. నాతో కలిసిన ఆ ప్రపంచంలో- ఆమెకి ఇండియాకంటే జర్మనీ ఎక్కువ ఆకర్షణీయంగానూ, సదుపాయంగానూ అనిపించడం అసహజం కాదు.

"బాండ్ విషయంలో- దానికి విలువివ్వనివాళ్లు మనకి ఆదర్శంకాదు. మన ఆదర్శం నిజాయితీయే" అని ఆమెకు నచ్చజెప్పబోయాను.

శ్రీమతి వెంటనే, "మీరు నిజంగా నిజాయితీకోసం వెనక్కెళ్లిపోదామంటే, నా ఓటు మీకే! కానీ అసలు విషయం వేరే ఉంది. మీకే ఇక్కడ ఉండాలని లేదు. తొందరగా ఇండియా వెళ్లి మనవాళ్లని కలుసుకోవాలని మీ తహతహ. అందుకే ఇక్కడుండే ప్రయత్నాలు చెయ్యడం లేదు. కానీ కాస్త ఆలోచించండి. ఇండియాలో మనకేముంది- నెలజీతం తప్ప! ఇక్కడున్నామనుకోండి, అక్కడ పదేళ్లలో కూడబెట్టలేనిది- ఇక్కడ ఒక్క ఏడాదిలో సంపాదించొచ్చు. దాంతో మనవాళ్ల అవసరాలు తీర్చొచ్చు. ఏదో అనుకుంటాం కానీ, క్రమంగా మనవాళ్లకీ మన కంటే మన డబ్బే ఎక్కువ బాగుంటుంది. సంతోషిస్తారు" అంది.

ఆమె చెప్పింది చాలావరకూ నిజం. కానీ ఆమె అనుకుంటున్నట్లు అవకాశాలు నన్ను వెదుక్కుంటూ రావు. అందుకు నేను బాగా చొరవ చెయ్యాలి. అది నావల్ల కాదు. ఆపైన నేను నిజంగానే బాండ్‌కి కట్టుబడి ఉన్నాను. ఆ విషయం ఆమె నమ్మదల్చుకోలేదు.

అలాగని- శ్రీమతికి తనవాళ్లన్నా, జన్మభూమి అన్నా ఆకర్షణ లేదనుకోను. కానీ జన్మభూమిలో మా జీవితం గొప్పగా లేదు. అదప్పుడు తెలియలేదు. ఇక్కడికొచ్చేక తెలిసింది. ఈ జీవితాన్ని వదులుకోవాలని అనిపించడంలేదు.

ఇక నేను చెయ్యగలిగిందొక్కటే! తిరిగి వెళ్లేక- ఆమెకు అక్కడ కూడా ఇంత మంచి జీవితం ఇవ్వాలి. కానీ అదంత సులభసాధ్యమా?

రోజులు పరుగెడుతున్నాయి. నాకొచ్చిన మూణ్ణెల్ల ఎక్స్‌టెన్షనూ అయిపోవస్తోంది. తొందరపడొద్దన్న భరత్ ఉత్తరం తర్వాత, మా ఆఫీసునుంచి నాకే సమాచారమూ లేదు. ఏం జరుగుతోందక్కడ?

ఏంచెయ్యాలో తెలియక భరత్‌కి ఉత్తరం వ్రాస్తే, ఆయన్నుంచి బదులు లేదు. కానీ- భువనేశ్వర్లో మా ఆఫీసునుంచి ఉత్తరం వచ్చింది.

'నీ స్కాలర్‌షిప్ కాలపరిమితిని మూడు నెలలు పొడిగించడానికి అనుమతినిస్తూ గతంలో నీకు లేఖ వ్రాసాం. ఆ ప్రకారం నీవు రానున్న జనవరి మొదటి వారంలో ఆఫీసుకొచ్చి జాయినవాలి. కానీ నువ్వక్కడ అదనంగా మరో మూణ్ణెల్లు ఉండడానికి, అక్కడి 'డాడ్' ఆఫీసు ద్వారా ఇక్కడి ఆఫీసుమీద ఒత్తిడి తీసుకొస్తున్నావు. ఇది నియమభంగం. ఈ విషయమై నీమీద క్రమశిక్షణ చర్య ఎందుకు తీసుకోకూడదో వివరించ గోరతాము'

ఇదీ ఆ లేఖలో సారాంశం.

వ్రాసింది డైరెక్టరు కాదు. సీయస్ రావు అనే కొత్త అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు.

ఈ సీయస్ రావుగారి రాక గురించి అప్పటికే నాకు కొలీగ్సు ఉత్తరాల ద్వారా తెలిసింది.

కన్నడిగుడు. ఆయన, కుటుంబ సభ్యులు తెలుగు ధారాళంగా మాట్లాడుతారు. కాలనీలో తెలుగువారిలో ఒకడిగా కలిసిపోయాడు. మావాళ్లు జరుపుకునే తెలుగు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు.

'ఆయన సాహితీ ప్రియుడు. మీరెప్పుడొస్తారా, ఎప్పుడు కలుసుకుందామా- అని ఎదురు చూస్తున్నాడు' అని నా మిత్రుడు రవి ఉత్తరంలో వ్రాశాడు కూడా. ఆయన్ను కలుసుకుని పరిచయం చేసుకోవాలని నాకూ ఆత్రంగా ఉంది.

ముఖాముఖీ కలుసుకోకుండానే ఇప్పుడిలా జరిగింది మా పరిచయం. నిజానికాయన పంపింది లేఖ కాదు. తాఖీదు.

శ్రీమతికి చూపించాను. చదివి, "భయపడుతున్నారా?" అంది.

"భయమా, ఎందుకు? నావల్ల తప్పు జరిగితే కదా!" అన్నాను.

శ్రీమతి తృప్తి పడలేదు, "భయం కాకపోతే, మీలో ఆ టెన్షనెందుకు?" అంది.

"టెన్షనేం లేదు. కానీ మన జర్మనీ ట్రిప్పులో ఇంతవరకూ అన్నీ సజావుగా జరిగిపోయాయి. చివర్లో ఈ అపశ్రుతి ఏమిటీ అని కొంచెం అప్సెట్ అయ్యానంతే!" అన్నాను.

"మీవల్ల తప్పు జరగలేదని నమ్మకమేగా?"

"నూటికి నూరు శాతం" అన్నాను.

"ఐతే దీనికి దీటుగా బదులివ్వండి. ఏంచేస్తారో చూద్దాం" అంది శ్రీమతి.

ఆ గొంతులో ధ్వనించిన కసికి ఆశ్చర్యపోయాను.

దీటుగానే బదులివ్వాలని నాకూ ఉంది. కానీ పేదవాడి కోపం పెదవికి చేటు.

సీయస్ఐఆర్ సంస్థలో దేశమంతటా ఉన్న నలభైకి పైగా లేబరేటరీలన్నింటికీ- ఒకే ఒక్క విషయంలో సామ్యముంది. లేబరేటరీకి డైరెక్టర్ అంటే- రాష్ట్రానికి ముఖ్యమంత్రిలా అనుకోవడంలో!

పాలకుడూ, పాలితులూ సైంటిస్టులే కాబట్టి- రాజకీయాలు అంతగా ఉండవు. ఉన్నా వాటిలో అంతగా పస ఉండదు. ఐతే వివాదాలు వచ్చినప్పుడు మాత్రం- 'నా మాటే శాసనం' అన్న అధికారధోరణిని భరించాలి. తర్కం వాడితే అది కంఠశోషే ఔతుంది.

అందుకో చిన్న ఉదాహరణ.

ఇది భువనేశ్వర్లో కాదు- మరో రాష్ట్రంలో లేబరేటరీలో జరిగింది.

ఒక సైంటిస్టుకి కొన్నేళ్లుగా ప్రమోషన్ రావడం లేదు. ఐదేళ్లలో మూడు ఇంటర్వ్యూల్లో ఫెయిలయ్యాడు.

'నేనంటే డైరెక్టరుకి ఇష్టం లేదు. అందుకే నాకు ప్రమోషన్ రావడం లేదు' అని అతడు హెడ్డాఫీసుకి ఫిర్యాదు చేశాడు. హెడ్డాఫీసు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఓ త్రిసభ్య కమిటీ వేసింది. ఆ కమిటీ సమావేశంలో డైరెక్టరు, 'ఇతగాడు ఏ ప్రయోగమూ శ్రద్ధగా చెయ్యడు. ఒక్కసారి కూడా ఊహించిన ఫలితం రాలేదు' అని తన మాట చెప్పాడు. కమిటీ ఆ సైంటిస్టుని సంజాయిషీ అడిగింది.

'సర్! ఈయన నాకు డైరెక్టర్. ఈయన మాట నేను వినాలి. వింటాను. కానీ ప్రయోగాలు కూడా తన మాట వినాలంటే, ఇక ప్రయోగాలు చెయ్యడమెందుకు? ఆయనే ఫలితం చెప్పేస్తే సరిపోదూ! నేనైతే, చెప్పిన ప్రయోగం చెప్పింది చెప్పినట్లు

చెయ్యగలను. ఊహించిన ఫలితం రాకపోతే, ఎందుకు రాలేదో చెప్పగలను. ఊహించిన ఫలితం రావడానికి ప్రయోగంలో మార్పులకు ప్రయత్నించగలను. కానీ ఆయన చెప్పిన ప్రయోగానికి, ఆయన చెప్పిన ఫలితమే వచ్చేలా చెయ్యలేను' అన్నాడా సైంటిస్టు. ఆ సంజాయిషీ ఆ సైంటిస్టు ప్రమోషనుకి సహకరించిందా, లేదా అన్నది అప్రస్తుతం. ఐనా అది మన కమిటీల పనితీరు తెలిసినవారెవరైనా ఊహించగలరు.

ఇండియాలో మా లేబరేటరీలో భరత్‌కీ, ప్రఫుల్లకీ అంతగా పడకపోయినా– ఇంతవరకూ నాకు వారిద్దరితోనూ కూడా గొడవలు లేవు. డైరెక్టరు అడ్డుపడుంటే నాకీ జర్మనీ అవకాశమొచ్చేదే కాదు. ఎక్స్‌టెన్షన్ కూడా అడిగినంతా ఇవ్వకపోయినా కొంత ఇవ్వడం ఆయనకు నేనంటే మరీ అయిష్టం లేదనడానికి నిదర్శనం. ఇప్పుడు మూడు నెలల అదనపు సమయంకోసం రగడ జరగడం నాకిష్టం లేదు.

సుమారు రెండేళ్లు ఇక్కడ హాయిగా ఉన్నాను. కుటుంబంతో కలిసి ఏడాదిగా సంతోషంగా గడిపాను. వెళ్లేటప్పుడు సంతోషంగా వెళ్లాలి. వెళ్లేక మా ఆఫీసులో నన్ను సగౌరవంగా రిసీవ్ చేసుకోవాలి. అంతా ఆహ్లాదకరంగా జరిగిపోవాలి.

అంటే ముందు నేను ఆ అదనపు మూడునెలల గురించి నాకేదో అన్యాయం జరిగిన భావననుంచి బయటపడాలి.

ఇక శ్రీమతి నన్ను దీటుగా బదులివ్వమంది. అది నా ఆత్మాభిమానానికి స్ఫూర్తి.

కర్ర విరక్కూడదు. పాము చావకూడదు. ఇంకోలా చెప్పాలంటే– బ్లో హాట్ బ్లో కోల్డ్ టెక్నిక్ వాడాలి!

ఆ మాట నేననగానే శ్రీమతి, "నాతో మీరెప్పుడూ బ్లోహాటే– బ్లో కోల్డులో మిమ్మల్ని చూడలేదు. ముందు నాతో ప్రాక్టీసు చేసి, తర్వాత ఉత్తరం వ్రాయండి" అంది.

అది విసురు అని నాకు తెలుసు. తనకి కోపమొస్తే, నేను రెట్టింపు కోపం తెచ్చుకోవడమే తప్ప, బ్రతిమలాడింది లేదని తనంటుంది. అందులో కొంత నిజముందని నాకూ తెలుసు. అందుకని వాదించడానికి బదులు మాట మారుస్తుంటాను.

"సరే, నీతో ఉన్న ప్రాక్టీసు ఆధారంగానే ఇప్పుడో ఉత్తరం డ్రాఫ్ట్ చేస్తాను. అది బ్లో హాట్ బ్లో కోల్డ్ ఔనో కాదో నువ్వే చెప్పాలి" అని జవాబివ్వడానికి సమయం ఇవ్వకుండా ఉత్తరం మొదలెట్టాను.

ఆ ఉత్తరంలో వ్రాసిన ప్రకారం…

నాకు జర్మనీలో అడ్వాన్స్‌డ్ రీసెర్చి చేసే అవకాశం కలిగించినది డైరెక్టరు. ఆయనకు కృతజ్ఞుణ్ణి. పశ్చిమ జర్మనీ చూడతగ్గ గొప్ప దేశం. అక్కడున్నది అనుసరించదగ్గ గొప్ప వ్యవస్థ. సైంటిఫిక్ రీసెర్చికి– అక్కడివారిది పరిణతి చెందిన సాంకేతిక నైపుణ్యం. వారి పాలనా వ్యవస్థ ఆదర్శప్రాయం. అక్కడున్న సదుపాయాలు, ప్రొఫెసర్ రాలెక్ వంటి ప్రతిభావంతుల సాహచర్యం– సైంటిస్టుల కల. నా ప్రయోగాలు సత్ఫలితాలనివ్వడం నా అదృష్టం. అందువల్ల మా లేబరేటరీకి మంచి పేరు రావడం నాకు గర్వకారణం. డైరెక్టరు అదనంగా నాకిచ్చిన మూడు నెల్ల సమయం సద్వినియోగం కావడంతో నాకు పరిపూర్ణతృప్తి కలిగింది. అందుకే ఉన్నది చాలనుకుని, భువనేశ్వర్లో మాసంస్థలో మా డైరెక్టరుతో ఈ అనుభవాలన్నీ పంచుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నాను. బాధ్యత తెలిసిన సైంటిస్టుగా, నియమపాలనకు ప్రాధాన్యమిచ్చే ఉద్యోగిగా– తిరుగు ప్రయాణానికి ఏర్పాటు చేసుకుంటున్నాను.

అది బ్లో కోల్డ్. ఇక బ్లో హాట్ కొస్తే–

ఆఫీసునుంచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్నుంచి నాకో ఉత్తరమొచ్చింది. ఆ ఉత్తరంలో వ్రాసినవన్నీ తప్పుడు ఆరోపణలు. ఆ విషయం ఋజువు చెయ్యడానికి తగిన ఆధారాలు నావద్ద ఉన్నాయి. ఆ ఆఫీసరు నాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు విచారించి, అతడు ఈ ఉత్తరం వ్రాయడంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించేడా అన్నది పరిశీలించాలి. అందుకు అనువుగా ఉంటుందని- ఆ ఆఫీసరు నాకు లేఖగా పంపిన తాఖీదు జిరాక్సు కాపీని జతపర్చి- ఆ మేరకు డైరెక్టరుకి ఉత్తరం వ్రాశాను.

నేనా ఆఫీసరు గురించి ఉత్తరంలో అంత ఘాటుగా వ్రాయడానికి కారణాలున్నాయి.

ఒకటిః నా నిజాయితీ. ఎక్స్‌టెన్షన్ గురించి నేనెప్పుడూ ఎవరిమీదా ఒత్తిడి తేలేదు. తెచ్చానని ఎవరైనా ఆరోపించినా అందుకు సాక్ష్యం లేదు. సాక్ష్యం లేకుండా అఫీషియల్‌గా అటువంటి ఉత్తరాలు వ్రాయకూడదు.

రెండుః నిజానికా ఉత్తరం వ్రాయించింది మా డైరెక్టరని నాకు తెలుసు. ఏదో అక్కసులో నన్ను బెదిరించాలన్న ఆలోచన కలిగింది. సాక్ష్యం లేకుండా ఆలాంటి ఉత్తరం వ్రాయకూడదు కాబట్టి- తను వ్రాయకుండా, ఆఫీసరు చేత వ్రాయించాడు. అది పొరపాటని తెలిసినా ఆఫీసరుకది అసహాయత. పై అధికారికి సలహా ఇవ్వగలడు కానీ, పాటించకపోతే ఆయన శాసనాల్ని పాటించక తప్పదు. ఆ విషయం తెలిసినా నేను- ఆ ఉత్తరానికి ఆఫీసర్నే తప్ప డైరెక్టర్ని తప్పు పట్టలేదు. నా కోపం న్యాయమైనదే ఐనా- అది ఆఫీసరుమీదనే కానీ తనమీద కాదని డైరెక్టరు అనుకోవాలి.

మూడుః ఆ ఉత్తరం ఆఫీసు ఫైల్సులో నమోదై ఉండదని నా నమ్మకం. నమోదు కాని ఉత్తరానికొచ్చిన జవాబుపై చర్యలేముంటాయ్!

శ్రీమతికి ఈ ఉత్తరం చదివి వినిపిస్తే, "మీ ఉత్తరం బ్లో హాట్, బ్లో కోల్డ్‌కి మెచ్చుకోతగ్గ ఉదాహరణ అని ఒప్పుకుంటాను. కానీ ఈ ప్రాక్టీసు నాతో జరిగిందని మాత్రం ఒప్పుకోను. కర్ణుడికి కవచకుండలాల్లా ఈ కళ మీకు పుట్టుకతో వచ్చి ఉండాలి" అంది వెంటనే.

అని ఊరుకుండా, "ఇన్నాళ్లూ మీకు చేతకాదు కామోసనుకుని సరిపెట్టుకుంటున్నాను. ఇకమీదట నాకు కోపమొస్తే మీరు రెట్టింపు కోపంతో బదులిస్తే సహించేది లేదు" అని హెచ్చరించింది.

నేను వ్రాసిన ఆ ఉత్తరాన్ని శ్రీమతికి తప్ప ఇంకెవ్వరికీ చూపించలేదు. మర్నాడది పోస్టు చేసేక- మనసు బాగా తేలిక పడింది.

ఇక తిరుగు ప్రయాణానికి టికెట్ బుక్ చెయ్యాలి. పీత కష్టాలు పీతవి అన్నట్లు- ఆ బుకింగు కూడా స్వర్గావరోహణలో తన పాత్ర పోషించింది.....

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments